











ప్రమాణ స్వీకారం అనంతరం అసెంబ్లీ రిజిస్టరులో సంతకం చేస్తున్న చంద్రబాబు








అసెంబ్లీలో వేడుకగా ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

తిరుపతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో అలుపెరగక పోరాడి చిరస్మరణీయ విజయం సాధించిన 17మంది ఎమ్మెల్యేలు శుక్రవారం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేశారు.కుప్పం నుంచీ వరుసగా ఎనిమిదవ సారి అద్భుత విజయం సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణస్వీకారంతో కార్యక్రమం ప్రారంభమైంది.చిత్తూరు జిల్లాలో పలమనేరు నుంచి అమరనాథరెడ్డి,నగరి నుంచి గాలి భానుప్రకాష్,చిత్తూరు నుంచి గురజాల జగన్మోహన్, పూతలపట్టు నుంచి మురళీమోహన్, జీడీనెల్లూరు నుంచి థామస్,పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అన్నమయ్య జిల్లాలో పీలేరు నుంచి నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, మదనపల్లె నుంచి షాజహాన్ బాషా, తంబళ్లపల్లె నుంచి ద్వారకనాథ రెడ్డి, తిరుపతి జిల్లాలో చంద్రగిరి నుంచీ పులివర్తి వెంకటమణి ప్రసాద్ అలియాస్ నాని,తిరుపతి నుంచి ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి నుంచీ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి,వెంకటగిరి నుంచీ కురుగొండ్ల రామకృష్ణ, సత్యవేడు నుంచీ కోనేటి ఆదిమూలం, సూళ్ళూరుపేట నుంచీ నెలవల విజయశ్రీ, గూడూరు నుంచీ పాశం సునీల్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు.వీరిలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఓం నమోవెంకటేశాయ...అంటూ మొదలుపెట్టి దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేయగా పెద్దిరెడ్డి ఆంగ్లంలో ప్రమాణం చేశారు.



కలెక్టరేట్‌లో విద్యార్థుల యోగాసనాలు

యోగా...మంచిదేగా

యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా యోగాసనాల సందడి కన్పించింది. యోగాపై ఆసక్తి వున్న చిన్నా పెద్దా మొదలుకుని కార్యాలయాల్లో అధికారులు,సిబ్బంది, పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు.ఒత్తిడితో విధులు నిర్వర్తించే వారికి యోగాతో ఉపశమనం లభిస్తుందని యోగా అభ్యాసకులు సూచించారు.



బదిలీపై వెళుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు

తిరుపతిలో పనిచేయడం ఎప్పటికీ మరువలేను

- కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ -

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 21: 'తిరుపతి కలెక్టర్‌గా పనిచేయడం ఎప్పటికీ మరువలేను. ఇక్కడి నుంచే పదోన్నతిపై వెళ్లడం సంతోషంగా ఉంది' అని బదిలీపై వెళుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. భూగర్భశాఖ కమిషనర్‌గా బదిలీపై వెళుతున్న ఆయన్ను ఉద్యోగులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ- బీఎల్వో నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు అందించిన సహకారంతోనే సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, మీడియా సహకారం మరువలేనిదన్నారు. జేసీ ధ్యానచంద్ర మాట్లాడుతూ సీనియర్ ఐఏఎస్ నేతృత్వంలో సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నామన్నారు. డీఆర్వో పెంచలకిషోర్ మాట్లాడుతూ.. ఎక్కడా విమర్శలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఎస్‌డీసీలు చంద్రశేఖర్‌నాయుడు, మురళి, కోదండరామిరెడ్డి, జిల్లా అధికారులు ప్రసాదరావు, ప్రేమచంద్రారెడ్డి, చంద్రశేకర్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కలెక్టర్ బాధ్యతల స్వీకారం

ప్రవీణ్‌కుమార్ విధులనుంచి రిలీవ్ అయ్యారు. దాంతో జేసీ ధ్యానచంద్ర.. ఇన్‌చార్జి కలెక్టర్‌గా (పూర్తి అదనపు బాధ్యతలు) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కలెక్టరేట్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

గంజాయి నియంత్రణకు

యాక్షన్ ప్లాన్

యాంటీ డ్రగ్స్ కమిటీల ఏర్పాటు

విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 21 : తిరుపతి, చంద్రగిరి ప్రాంతాల్లో గంజాయి వినియోగానికి పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు పోలీసుశాఖ సిద్ధమైంది.జిల్లాలో గంజాయి విక్రయాలకు అడ్డాగా మారిన దాదాపు 49 ప్రాంతాలను గుర్తించిన పోలీసు యంత్రాంగం 100 రోజుల్లో గంజాయి వినియోగాన్ని పూర్తిగా అరికట్టడానికి యాక్షన్ ప్లాన్ రూపొందిస్తోంది.ఈ ప్రాంతాల్లో నిరంతరం నిఘా వుండేలా ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ప్రత్యేక యాక్షన్ టీమ్‌లు ఏర్పాటు చేయనున్నారు.యువకులు, విద్యార్థులు గంజాయికి అలవాటుపడకుండా ఉండేందుకు ఉపాధ్యాయులను భాగస్వాములను చేస్తూ యాంటీ డ్రగ్ కమిటీలను నియమించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు నిర్ణయించారు. గంజాయి, మత్తు మందుల వినియోగం వల్ల తలెత్తే సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కళాశాలల్లో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసులతో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు.ఆయా కమిటీలు గంజాయి వినియోగిస్తున్న యువకులను, విద్యార్థులను గుర్తించి పోలీసులకు సమాచారం అందిస్తే వారిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించనున్నారు.



ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు :ఎస్పీ

తిరుపతి, చంద్రగిరి ప్రాంతాల్లో గంజాయి రవాణాతో పాటు వినియోగం, విక్రయాలను అరికట్టడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు.జిల్లాలోకి గంజాయి రాకుండా వుండడానికి అవసరమైన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు.సీఐ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్ఐలు, 10 మంది ఎస్‌టీఎఫ్ బలగాలు, సెబ్ సిబ్బంది, స్థానిక పోలీసులతో కలిపి 20 మందిని టాస్క్‌ఫోర్సు కమిటీలో నియమిస్తున్నామన్నారు.

ఉద్యోగంలో చేరేందుకు వెళ్తూ....

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రమాద దృశ్యం

తడ, జూన్ 21: ఆ యువకుడికి అపాచీ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.తొలిరోజు విధుల్లో చేరేందుకు ఆనందంగా వెళ్తున్న ఆ యువకుడిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కాటేసింది.పోలీసుల కథనం మేరకు... వాకాడు మండలం నెల్లిపూడికి చెందిన బి.వంశీకి (28) తడ మండలం మాంబట్టు పారిశ్రామిక వాడలోని అపాచీ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.ఉద్యోగంలో చేరేందుకు శుక్రవారం ఉదయం వాకాడు నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో తడ మండలం కాదులూరు సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును అధిగమించే క్రమంలో మరో మోటరు సైకిల్‌ను ఢీకొని అదుపుతప్పడంతో బస్సుకింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో దాదాపు రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది.



వంశీ (ఫైల్ ఫొటో)

పీఎస్-4 హోటల్ సీజ్



కిచెన్‌లో పాడైపోయిన పనసకాయలను పరిశీలిస్తున్న మున్సిపల్ ఆరోగ్యవిభాగ సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), జూన్ 21 : తిరుపతిలోని లీలామహల్ సర్కిల్ సమీపంలో ఉన్న పీఎస్-4 హోటల్‌ను కార్పొరేషన్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. గురువారం మధ్యాహ్నం హోటల్‌లో భోంచేస్తుండగా పుత్తూరు యువకుడికి చపాతి, బీట్‌రూట్ కర్రీలో జెర్రి కనిపించింది. ఆయన పిర్యాదుతో మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య విభాగ అధికారులు హోటల్‌ను తనిఖీ చేశారు.కిచెన్‌లో కూరగాయలు, ఇతర పదార్థాలు నిల్వ ఉంచడానికి అనువైన వాతావరణం లేదని గుర్తించారు. కుళ్లిన కూరగాయలు, ఆహార పదార్థాలను కూడా అక్కడ గమనించి సిబ్బందిని నిలదీసి తాత్కాలికంగా కిచెన్‌ను సీజ్ చేశారు. అయితే మళ్ళీ హోటల్ యధావిధిగా నడుస్తుండడంతో శుక్రవారం సీపీఎం నాయకులు హోటల్ ఎదురుగా ఆందోళన చేపట్టి హోటల్‌ను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో దిగి వచ్చిన కార్పొరేషన్ హెల్త్ అధికారులు హుటాహుటిన హోటల్‌ను సీజ్ చేసినట్లు నోటీసు అతికించారు. దీంతో శుక్రవారం నుంచి హోటల్ మూతపడింది.

నాణ్యమైన నెయ్యితో శాంపిల్ లడ్డూలు తయారు చేయండి



పోటు కార్మికులకు సూచనలిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన నెయ్యి, శెనగపిండి, యాలకులతో శాంపిల్ లడ్డూలు తయారు చేయాలని పోటు కార్మికులను టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. శ్రీవారి లడ్డూల నాణ్యత తగ్గిందంటూ భక్తుల నుంచి వరుసగా ఫిర్యాదులు అందిన విషయం తెలిసిందే. అయితే దిట్టం ప్రకారమే లడ్డూలను తయారు చేస్తున్నామని, తమ పూర్వీకుల విధానాలనే పాటిస్తున్నామంటూ పోటు కార్మికులు కూడా మీడియా ముందుకు వచ్చి మాట్లాడిన సందర్భాలున్నాయి. టీటీడీ ఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్యామలరావు ప్రతి విభాగంపై ప్రత్యేక దృష్టిసారించి.. సంబంధిత విభాగాలతో సమీక్షిస్తున్నారు. లోటుపాట్లను గుర్తించి పలు సూచనలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే తిరుమలలోని గోకులంలో శుక్రవారం లడ్డూల తయారీపై జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్‌తో కలిసి సమీక్షించారు. లడ్డూల తయారీలోని సమస్యలు, నాణ్యతపై వస్తున్న విమర్శలకు గల కారణాలను పోటు కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పోటు కార్మికులు లడ్డూల తయారీకి వినియోగిస్తున్న శెనగపిండి, నెయ్యి, యాలకులను ఈవోకు చూపారు. పనిభారం పెరిగిపోతోందని, అదనపు సిబ్బందిని నియమించాలని విన్నవించారు. ఈ సమావేశంలో ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, పోటు ఏఈవో శ్రీనివాసులు, విశ్రాంత ఏఈవోలు శ్రీనివాసన్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.




కాలువలో ఇరుక్కుపోయిన వారిని ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీస్తున్న స్థానికులు

కాలువలో ఇరుక్కున్న కూలీలు

- గంటపాటు నరకయాతన, తీవ్రగాయాలు

తిరుచానూరు, జూన్ 21: నవజీవన్ ఆస్పత్రి సమీపంలో శుక్రవారం నిర్మాణ పనులు చేస్తుండగా హేమంత్, ప్రసాద్ అనే ఇద్దరు కూలీలు ప్రమాదవశాత్తూ కాలువ గోడల మధ్య ఇరుక్కుపోయారు. స్థానికులు గమనించి.. వారికి వెలికితీయడానికి విఫలయత్నం చేశారు. చివరకు ఎక్స్‌కవేటర్‌ను తీసుకొచ్చి.. వారిద్దరినీ బయటకు తీశారు. దాదాపు గంటపాటు కూలీలిద్దరూ నరకయాతన అనుభవించారు. కాళ్లు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. స్థానికులు పట్టించుకోకుంటే వారి పరిస్థితి మరింత విషమంగా మారేది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యా సామగ్రి వితరణ



భాకరాపేట, జూన్ 21: చిన్నగొట్టిగల్లు మండలం బోడిరెడ్డిగారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని అదే గ్రామానికి బుగ్గారెడ్డి రమేశ్‌రెడ్డి వితరణగా శుక్రవారం అందజేశారు. ఎంఈవో సత్యానారాయణ, టీచర్ రెడ్డెప్పరెడ్డి, టీడీపీ నాయకులు ఫణీందర్ రెడ్డి, నరసింహారెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

భాకరాపేట, జూన్ 21: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంపీడీవో సోమశేఖర రెడ్డి అన్నారు. బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లులో విద్యార్థులతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో-2 గోపీనాథ్, కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



పాకాల, జూన్ 21: ఇరంగారిపల్లె పంచాయతీ పాలినేనివారిపల్లెలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి సీతారాముల చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి గరుడ సేవ



తిరుపతి రూరల్, జూన్ 21: తుమ్మలగుంటలోని కల్యాణ వెంకన్న ఆలయంలో శుక్రవారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి వారు గరుడవాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

రామచంద్రాపురం, జూన్ 21: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని వెరిటాస్ సైనిక్ స్కూల్ ఛైర్మన్ శేషారెడ్డి కోరారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. డైరెక్టర్ శ్రీకర్‌రాజు, డీన్ ఖాన్, ప్రిన్సిపాల్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతోనే అధిక దిగుబడి



రైతులతో మాట్లాడుతున్న ప్రసాద్‌రావు, మమత

తిరుపతి రూరల్, జూన్ 21: భూసార పరీక్షలతోనే పంట అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు అన్నారు. గొల్లపల్లె రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. గ్రామానికి చెందిన రైతులతో భూసార పరీక్షల వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. అధికారులు మనోహర్, మమత, ప్రహర్ష, సునీల్‌కుమార్‌రెడ్డి, ప్రేమలత పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



తిరుచానూరు, జూన్ 21: తిరుపతి రూరల్ మండలం సాయినగర్‌లో శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్థానిక సర్పంచ్ డీవీ రమణ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పులివర్తి నాని ప్రమాణస్వీకారోత్సవ సంబరాలు



మురళిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, జూన్ 21: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అసెంబ్లీలో ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని భాకరాపేటలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎన్నికల సందర్భంగా నానీ విజయానికి టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి చేసిన కృషిని ప్రశంసించి, సత్కరించారు. తెలుగు యువత నాయకుడు శ్రీధర్ రాయల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. టీడీపీ నాయకులు మదనమోహన, చిట్టెమ్మ, వైఎస్ ఎంపీపీ సునీత దామోదరం, ఎంపీటీసీ విజయశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మంగళంలో అన్నదానం

మంగళం, జూన్21: ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్, చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుక్రవారం జనసేన ఆధ్వర్యంలో అన్నదానం చేవారు. మంగళంలోని ఆర్టీవో కార్యాలయం సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు యువకిషోర్ రాయల్, పగడాల యువరాజు రాయల్, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, గోపీనాథ్, మహేశ్వరి సురేష్‌నాయుడు, బీజేపీ నాయకుడు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



గరుడుడిపై లోకమాత సాక్షాత్కారం



గరుడ వాహనంపై అమ్మవారు

- ముగిసిన అమ్మవారి తెప్పోత్సవాలు



తిరుచానూరు, జూన్ 21: శ్రీవారి పట్టపురాణి, లోకమాత అయిన పద్మావతిదేవి వార్షిక తెప్పోత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొపి ఆలయ అర్చకులు నిత్య కైంకర్యాలను నిర్వహించారు. మూలమూర్తికి వేడుకగా అభిషేకం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని పద్మసరోవరం(అమ్మవారి పుష్కరిణి)లోని నీరాడమండపానికి వేంచేపుచేసి కొలువుదీర్చారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ స్నపనతిరుమంజనం నిర్వహించారు. అలంకార శోభితురాలైన అమ్మవారు తెప్పపై కొలువుదీర్చి పద్మసరోవరంలో ఏడు పర్యాయాలు విహరింపజేశారు. భక్తులు నారికేళ, కర్పూర హారతులను అమ్మవారికి సమర్పించారు. రాత్రి పద్మావతీ దేవి గరుడ వాహనంపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగేతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠ, సూపరింటెండెంట్లు మధు, శేషగిరి, టెంపుల్‌ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో విహరిస్తున్న పద్మావతీదేవి

నేటినుంచి యథావిధిగా ఆర్జిత సేవలు

అమ్మవారి ఆలయంలో శనివారంనుంచి ఆర్జిత సేవలు యథావిధిగా కొనసాగుతాయని టీటీడీ అధికారులు తెలిపారు.

కుంట పోరంబోకు స్థలం స్వాధీనం




ఆనకట్ట కోసం పోస్తున్న మట్టి - రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, జూన్ 21: గత ప్రభుత్వంలో అన్యాక్రాంతమైన కుంట పోరంబోకు స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 68 రామిరెడ్డిపల్లె పంచాయతీలోని సర్వే నెంబరు 413లో 2.77 ఎకరాల స్థలం ఉంది. గత ప్రభుత్వంలో ఈ స్థలాన్ని స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేసి, అందులో తాత్కాలిక షెడ్డు చేపట్టారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు టీడీపీ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో కుంట పోరంబోకు స్థలాన్ని అధికారులు సర్వే చేసి, సరిహద్దులు నాటారు. దీని చుట్టూ గ్రావెల్ తోలి ఆనకట్ట ఏర్పాటు చేస్తున్నారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. ఈ కుంట ఉండటం వల్ల వర్షాకాలంలో నీరు నిల్వ చేరి.. చుట్టుపక్కల గ్రామాలకు తాగునీరు అందుతుందని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాకాల, జూన్ 21: పాకాల 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈఈ నరేంద్ర, ఏఈ ప్రశాంత్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని చెన్నుగారిపల్లె, పికొత్తకోట, పాకాల టౌన్, ఇరంగారిపల్లె, పంటపల్లె, నేంద్రగుంట పరిసరాల్లో ఈ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యోగాతో మానసిక ఒత్తిడి అధిగమించవచ్చు



కలెక్టరేట్‌లో..



వేద వర్సిటీలో..



స్విమ్స్‌లో..

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 21: యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు యోగాసనాలు వేశారు. డీఆర్వో పెంచలకిషోర్, డీఎంహెచ్‌వో శ్రీహరి, ఎస్‌డీసీ మురళి, జిల్లా అధికారులు బాలకొండయ్య, ప్రేమంద్రారెడ్డి, సయ్యద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల, ఆంధ్రజ్యోతి: తిరుమలలోని ఆస్థాన మండపంలో జరిగిన కార్యక్రమంలో భారత ప్రభుత్వం హోం శాఖ పరిధిలోని ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్ (ఐటీడీపీ) సిబ్బంది పాల్గొన్నారు. వీరితోపాటు టీటీడీ ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, భక్తులు కూడా యోగాసనాలు వేశారు.

తిరుపతి రూరల్: ఎస్వీ వేదవర్సిటీలో విద్యార్థులు పలు యోగాసాలను వేశారు. వీసీ రాణీసదాశివమూర్తి రచించిన ఆకాశం నవ్వుతోంది(వచనా కవితా సంపుటి)అనే గ్రంథాన్ని ముఖ్యఅతిథిగా వచ్చిన స్విమ్స్ వైద్యుడు డాక్టర్ అల్లాడి మోహన్ ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ రాధాగోవిందత్రిపాఠి, ఎన్ఎస్ఎస్ అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నీలకంఠం, పరిశోధనా విభాగం డీన్ రాధేశ్యామ్, పీఆర్వో టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు. ● సి.గొల్లపల్లెలోని సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాల, మంగళంలోని నారాయణ స్కూల్, ఎస్వీ వ్యవసాయ కళాశాలలోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

తిరుపతి(వైద్యం): స్విమ్స్‌లోని సిద్ధ వైద్య రీసెర్చ్ యూనిట్‌లో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ ఆర్వీకుమార్, యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ సామ్రాట్, వైద్యాధికారులు అపర్ణ బిట్లా, మాధవి, మధుబాబు తదితరులు పాల్గొన్నారు. ● ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, ఈఎస్ఐ ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ శ్రీధర్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

తిరుపతి(నేరవిభాగం): పోలీసు పరేడ్ గ్రౌండులో జరిగిన కార్యక్రమంలో సిబ్బందితో కలిసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పాల్గొన్నారు.



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో..

చంద్రగిరి: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ మేడసాని పురుషోత్తం నాయుడు, హెచ్ఎం వెంకటనారాయణరెడ్డి, విద్యార్థినులు, బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ● ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈశా ఫౌండేషన్ సభ్యుడు శ్రీహరినారాయణ్, వైస్‌ఛాన్సలర్ ఆచార్య నాగరాజరామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాకాల: ప్రభుత్వ డిగ్రీ, బాలుర జూనియర్ కళాశాలల్లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా, ఎన్‌సీసీ అధికారి ఈశ్వరబాబు, ఎన్ఎస్ఎస్ పీవో మాశిలామణి, ఆర్ఆర్‌సీ సమన్వయ కర్త చిట్టికళావతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డిపై డీజీపీ, సీఐడీలకు ఫిర్యాదు

టీటీడీ పూర్వ ఈవో అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ కోరిన తిరుపతివాసి

తిరుపతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పూర్వ ఈవో, ప్రస్తుత అదనపు ఈవో ధర్మారెడ్డిపై డీజీపీ, సీఐడీ అదనపు డీజీపీలకు తిరుపతి శ్రీనివాసపురానికి చెందిన చెందిన ఎం.రామచంద్రనాయుడు ఫిర్యాదు చేశారు. ధర్మారెడ్డి ఉద్దేశపూర్వకంగా చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.టీటీడీ ఈవోగా ఆయన పనిచేసిన కాలంలో భక్తుల నుంచీ వచ్చిన డబ్బును, ప్రోటోకాల్ పేరుతో దర్శనాలను దుర్వినియోగం చేశారని, వైసీపీకి అనుకూలంగా వ్యక్తులను, వ్యవస్థలను మేనేజ్ చేసి శ్రీవారి పవిత్రతకు భంగం కలిగించారని ఆరోపించారు. శ్రీవాణి ట్రస్టుకు సంబంధించిన డబ్బును దారి మళ్ళించారన్నారు. సమరసత సేవా ఫౌండేషన్‌కు, టీటీడీకి నడుమ జరిగిన ఆర్థిక లావాదేవీలపై విచారణ జరపాలని కోరారు. ఇంజనీరింగ్ బడ్జెట్ ద్వారా అవసరం లేకున్నా కమీషన్ల కోసం వేల కోట్ల రూపాయలు మంచినీళ్ళప్రాయంగా ఖర్చు చేసి కొన్ని టెండర్ల రూపంలో, మరికొన్ని నామినేషన్ రూపంలో మంజూరు చేసిన పనులమీద, వాటి నాణ్యత మీద విచారణ చేపట్టాలని కోరారు. అత్యవసరం పేరిట శానిటేషన్, ఇతర పనులు నామినేషన్‌పై చేసిన పనులన్నింటిపై దర్యాప్తు చేయాలని అభ్యర్థించారు. లడ్డూ ప్రసాదాల కోసం, అన్న ప్రసాదాల కోసం నాణ్యత లేని సరుకులు కొనుగోలు చేయడంపైన, వాటి ధరలు, నాణ్యతపైన విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ప్రోటోకాల్ లేని వారికి కేటాయించిన సేవా టికెట్లపై కూడా విచారణ జరపాలని కోరారు. వీఐపీ, వీవీఐపీ ప్రోటోకాల్‌లో వున్నవారిని, లేని వారిని కూడా శ్రీవారి సన్నిధిలో తరింపజేసి తద్వారా వైసీపీ అధినాయకులకు అనుకూలంగా పనులు చేయించిన దానిపై లోతుగా దర్యాప్తు జరపాలని కోరారు. తిరుమలలో ఎవరికీ లేని విధంగా విశాఖ స్వరూపానంద ఆశ్రమానికి భవన నిర్మాణానికి అనుమతులు జారీ చేయడంపైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని విభాగాలలో తనకు అనుకూలంగా వున్న వారిని సలహాదారులుగా నియమించుకోవడంపైన, వారికి చెల్లించిన జీతభత్యాలపైన సమగ్ర విచారణ జరపాలని తనను టీడీపీ రాష్ట్ర నాయకుడుగా పేర్కొంటూ ఎం.రామచంద్రనాయుడు లిఖిత పూర్వక ఫిర్యాదులు చేశారు.

సీఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

- కుప్పంలో కలెక్టర్ పరిశీలన



కుప్పంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

కుప్పం, జూన్ 21: కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ ఎస్.షన్మోహన్ పరిశీలించారు. చంద్రబాబు ఈనెల 25, 26 తేదీల్లో సొంత నియోజకవర్గమైన కుప్పం పర్యటనకు రానున్న విషయం తెలిసిందే. దీనికి అవసరమైన ఏర్పాట్లను విస్తృతంగా పరిశీలించిన కలెక్టర్, అధికారులకు తగు సూచలను ఇచ్చారు. మొదట పీఈఎస్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అదే కళాశాల ఆవరణలో సమావేశ నిర్వహణకోసం ఆడిటోరియంలో ఏర్పాట్లను చూశారు. ఆర్టీసీ బస్టాండు కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించే అవకాశం ఉన్నందున అక్కడికి చేరుకున్న కలెక్టర్ పుష్పాలంకరణ, ఇతర ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి బస చేయనున్న ఆర్ అండ్ బి అతిథి గృహంలో మొదలైన ఆధునికీకరణ పనులను పర్యవేక్షించారు. ఇక్కడ ప్రజలనుంచి వినతులు స్వీకరించడానికి వీలుగా బ్యారికేడింగ్ నిర్మాణంపై తగు సూచనలు చేశారు. ఇంకా ముఖ్యమంత్రి రెండు రోజుల పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే భవనంలో ముఖ్యమంత్రి బస చేయనున్నందున ఇక్కడ పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ పి.శ్రీనివాసులు, ఆర్ అండ్ బి ఎస్ఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, పలమనేరు ఆర్డీవో మనోజ్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనాథ్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, తహసీల్దారు హరికుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం తదితరులు పాల్గొన్నారు. ఇక, శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె వద్ద హంద్రీ నీవా కాలవను సీఎం పరిశీలిస్తారని తెలిసింది. అందుకనే శుక్రవారం ఈ కాలువను కలెక్టర్ పరిశీలించారు.

చంద్రబాబు పర్యటన ఇలా

తన పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు రెండు రోజులూ కుప్పంలోనే గడపనున్నారు. అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాలుపంచుకోనున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు..25వ తేదీ ఉదయం 11గంటలకు అమరావతి నుంచి హెలికాప్టరులో బయలుదేరి కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల క్రీడామైదానంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. ఆర్టీసీ బస్టాండు కూడలిదాకా రోడ్ షోలో పాల్గొంటారు. అక్కడ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అక్కడే ప్రజలనుద్దేశించి కాసేపు ప్రసంగిస్తారు. తనకు ఘన విజయం అందించినందుకు ధన్యవాదాలు తెలుపుతారు. అక్కడ్నుంచి పీఈఎస్ ఆడిటోరియం చేరుకుని పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. అక్కడే నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశమై పార్టీ కార్యక్రమాలపై చర్చిస్తారు. రాత్రి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. తిరిగి 26వ తేదీ ఉదయం గెస్ట్ హౌస్ వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం పీఈఎస్ ఆడిటోరియంలో జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులతో సమావేశమై జిల్లా అభివృద్ధిపై సమీక్షిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు హెలికాప్టరులో అమరావతికి బయలుదేరుతారు.

'నీట్'ను మళ్లీ నిర్వహించాలి: ఎన్ఎస్‌యూఐ



ఆందోళనలో పాల్గొన్న మల్లికార్జున తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 21: నీట్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. నేషనల్ కమిటీ ఇచ్చిన పిలుపుతో శుక్రవారం ఎస్వీయూలో నిర్వహించిన నిరసనలో ఆయన ప్రసంగించారు. నీట్ పరీక్షల వ్యవహారంలో అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ తిరుపతి నగరాధ్యక్షుడు యార్లపల్లి గోపి మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలతో చెలగాటం అడుతున్న వారికి గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు. నాయకులు షేక్ జావెద్, సురేష్, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పెమ్మసానికి సత్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 21: కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను తెలుగు యువత సత్కరించింది. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం చౌదరి, తిరుపతి టీడీపీ నాయకులు వినోద్‌యాదవ్, బాలయ్య పాల్గొన్నారు.

యాదవ సామాజిక వర్గానికి మంచి రోజులు



శ్రీనివాస్

తిరుపతి(వైద్యం), జూన్ 21 : యాదవ సామాజిక వర్గానికి మంచి రోజులు వచ్చాయని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబు సీఎంగా పగ్గాలు చేపట్టడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పక నెరవేరుస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు.

జిల్లా పోలీసుల పనితీరు స్ఫూర్తిదాయకం: ఎస్పీ



సిబ్బందికి భోజనం వడ్డిస్తున్న హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 21: ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా పోలీసులు పనితీరు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కొనియాడారు. శిల్పారామం కన్వెన్షన్ హాలులో శుక్రవారం తిరుపతి, తిరుమల సబ్ డివిజన్ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. అనంతరం అదనపు ఎస్పీలతోకలసి పోలీసు సిబ్బందికి స్వయంగా భోజనం వడ్డించి.. వారితో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.




టీడీపీ ఆధ్వర్యంలో.. - జనసేన ఆధ్వర్యంలో..

గౌరవసభగా మారిన అసెంబ్లీ
నగరంలో కూటమి నేతల సంబరాలు

తిరుపతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): 'అసెంబ్లీని గత వైసీపీ ప్రభుత్వం కౌరవ సభగా మార్చేసి, మహిళలను కించపరిచింది. ఎన్డీఏ కూటమి విజయంతో గౌరవ సభగా మారింది' అని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు తిరుపతి టీడీపీ ఇన్‌చార్జ్ సుగుణమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం టీడీపీ, జనసేన నేతలు తిరుపతిలో సంబరాలు జరుపుకున్నారు. సుగుణమ్మ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, బుల్లెట్ రమణ, మన్నెం శ్రీనివాసులు నాయుడు, రుద్రకోటి సదాశివం, బ్యాంకు శాంతమ్మ, కుమారమ్మ, ఆముదాల తులసి, కరాటే చంద్ర తదితరులు పాల్గొన్నారు.

● తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా జనసేన, టీడీపీ నాయకులు నాలుక్కాళ్ల మండపం వద్ద సంబరాలు జరుపుకున్నారు. పవన్ కల్యాణ్ పాటలకు డ్యాన్స్ చేశారు. ఊహించని మెజార్టీతో ఆరణిని గెలిపించిన తిరుపతి ప్రజల రుణం తీర్చుకుంటామని నాయకులు ఆరణి శివకుమార్, ఊకా విజయకుమార్, పొలకల మల్లికార్జున్, మహేష్ యాదవ్, రాజా రెడ్డి అన్నారు. పవన్‌ను అసెంబ్లీ గేటు తాకలేరని చెప్పిన వైసీపీ నాయకులు అటువైపు వెళ్లేందుకు కూడా అర్హత కోల్పోయారన్నారు. ఆకేపాటి సుభాషిణి, బాటా శ్రీనివాస్, నెలవాయి మురళి, వంశీ, రాజేష్ ఆచారి, పగడాల మురళి, గుత్తా నాగరాజ రాయల్, వినోద్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

బాబు, పవన్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం



అసెంబ్లీకి వన్నె తెచ్చిన చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు 35వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ పాలాభిషేకం చేశారు. స్థానిక సచివాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలసి సంబరాలు చేపట్టారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీఎం శ్రీధర్, జగన్నాథం, చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎస్-4 హోటల్‌ను మూసేయాలి: సీపీఎం



హోటల్ ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 21: తిరుపతిలోని పీఎస్-4 హోటల్‌ను తక్షణం మూసివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ హోటల్ వద్ద వినియోగదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. కార్పొరేట్ స్థాయిలో హోటల్ పెట్టి.. వినియోగదారులకు జెర్రి ఉన్న ఆహారాన్ని పెట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. యాజమాన్యం నిర్లక్ష్యం వైఖరికి పుత్తూరుకు చెందిన వినియోగదారుడు రాజశేఖర్ బలికావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు గురువారం హోటల్ తనిఖీ చేసి నోటీసులు ఇస్తే.. వాటిని చించేసి, మెయింటనెన్సు పేరుతో మూసివేసినట్లు బోర్డు పెట్టడం దారుణమన్నారు. భక్తులు, వినియోగదారుల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్న హోటల్ మాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తిరుపతిలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేయాలని అధికారులను కోరారు. నగర కార్యదర్శి సుబ్రమ్మణ్యం, నాయకులు జయచంద్ర, బాలసుబ్రహ్మణ్యం, సాయిలక్ష్మి, లక్ష్మి, వేణు, నరేంద్ర, రాధాకృష్ణ, మునిరాజ, రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన హోటళ్ల పరిస్థితేంటి?

పీఎస్-4 సంఘటనతో నగరంలోని మిగిలిన హోటళ్ల పరిస్థితేంటన్న ప్రశ్న జనంలో తలెత్తుతోంది. ఎందుకంటే వీటిపై తరచూ అధికారుల తనిఖీలు లేకపోవడంతో ఆయా యాజమాన్యాలు.. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతపై దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. పెద్ద సంఘటనలు జరిగితే తప్ప మున్సిపల్ కార్పొరేషన్ ఫుడ్ సేఫ్టీ, హెల్త్ అధికారులు కదలడం లేదన్న విమర్శలున్నాయి. ఇకనైనా నిరంతరం హోటళ్లపై తనిఖీలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతో సాధ్యం

తెలుగు మహిళలు



సమావేశంలో ప్రసంగిస్తున్న మహిళా నేతలు

తిరుపతి(వైద్యం), జూన్ 21: గాడి తప్పిన పాలనను సరిదిద్ది, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సామర్థ్యం సీఎం చంద్రబాబుకే ఉందని తెలుగు మహిళా నేతలు విజయలక్ష్మి, కుమారమ్మ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీ.. దోపిడీ పాలన నుంచి రాష్ట్రానికి మోక్షం లభించిందని, ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం మహిళా సాధికారిత దిశగా కృషి చేస్తుందనే నమ్మకం అందరిలోనూ ఉందన్నారు. నేతలు గీతావాణి, వసంత తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 24 మంది డీబార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 21: ఎస్వీయూనివర్సిటీలో నిర్వహిస్తున్న డిగ్రీ రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 24 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. తిరుపతి, మదనపల్లె, చిత్తూరు ప్రాంతాల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న వారిని హైపవర్ స్క్వాడ్ గుర్తించింది. శుక్రవారం నిర్వహించిన పరీక్షల్లో తిరుపతి - 5, మదనపల్లె-6, చిత్తూరు-13 మంది.. మొత్తం 24 మందిని డీబార్ చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు

తిరుమల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 62,756 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 31,510 మంది తలనీలాలు సమర్పించారు. శుక్రవారం తిరుమలేశుడిని మచిలీపట్నం ఎంపీ బాలశౌరీ, తెలంగాణ ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి దర్శించుకున్నారు.

నేడు పౌర్ణమిగరుడసేవ

తిరుమల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంలో శనివారం పౌర్ణమిగరుడసేవ జరగనుంది. ప్రతి నెలా పౌర్ణమి పర్వదినాన టీటీడీ గరుడ సేవను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం టీటీడీ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

తిరుపతి(ఆటోనగర్), జూన్ 21: సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ డివిజన్ ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. ఈస్ట్ సెక్షన్ పరిధిలోని కొర్లగుంట, రైల్వేకాలనీ, మధురానగర్, భవానీనగర్,రెడ్డి అండ్ రెడ్డికాలనీ, తుడా రోడ్డు, తిలక్‌రోడ్డు, వీవీ మహల్ రోడ్డు ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు. అలాగే ఆర్డీవో సబ్‌స్టేషన్ (అవిలాల) పరిధిలోని ఎంకే నాయుడు కాలనీ, అన్నమయ్య నగర్, ఆంధ్రా బ్యాంక్ కాలనీ, ధనలక్ష్మీ కాలనీ, అవిలాల, వాణినగర్, అంబేడ్కర్ కాలనీ, మజ్జిగ కాలువ, సుబ్బారెడ్డి కాలనీ ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

24న వాచీలు, మొబైల్ ఫోన్లు ఈ-వేలం

తిరుమల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ గుడుల్లో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వివిధరకాల వాచీలు, మొబైల్ ఫోన్లను ఈనెల 24వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ-వేలం వేయనున్నారు. కొత్తవి, ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న వాచీలు మొత్తం 14 లాట్లు, మొబైల్ ఫోన్లు 24 లాట్లు ఈ-వేలంలో ఉంచారు. ఇతర వివరాలకు 0877 2264429 నెంబరు ద్వారా మార్కెటింగ్ విభాగాన్ని సంప్రదించవచ్చని టీటీడీ తెలిపింది.

డయేరియా నియంత్రణకు చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 21: డయేరియా నియంత్రణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. విజయవాడ నుంచి శుక్రవారం వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జ్ కలెక్టర్ ధ్యానచంద్ర హాజరయ్యారు. గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. డీఎంహెచ్‌వో శ్రీహరి, డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి, ఐసీడీఎస్ అధికారులు జయలక్ష్మి, డీఎల్‌పీవో రూపారాణి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో అనధికార దుకాణాలను
తొలగించండి

టీటీడీ ఈవోకు సుగుణమ్మ ఫిర్యాదు



ఈవోకు శ్రీవారి జ్ఞాపిక అందజేస్తున్న సుగుణమ్మ

తిరుమల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో తిరుమలలో పుట్టగొడుగుల్లా ఏర్పాటైన అనధికార దుకాణాలను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుమల టీడీపీ అధ్యక్షుడు రాజుయాదవ్, ఇతర కార్యకర్తలతో కలిసి శుక్రవారం సాయంత్రం తిరుమలలో టీటీడీ ఈవో శ్యామలరావును కలిశారు. అక్రమంగా పెట్టిన దుకాణాలను తొలగించి.. నిజమైన స్థానికులు, టీటీడీ జారీ చేసిన లైసెన్స్‌దారులకు న్యాయం చేయాని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేశాక శ్రీవారిని దర్శించుకుని.. తిరుమల నుంచే ప్రక్షాళన మొదలుపెడతామని చెప్పారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో దాదాపు 650 తట్టలు, దుకాణాలు నకిలీ లైసెన్స్‌లతో ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఇంకొందరు నిబంధనలకు విరుద్ధంగా అధిక స్థలాన్ని ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న విషయాన్ని కూడా ఈవోకు తెలిపామన్నారు. ఇక, శ్రీవాణి ట్రస్టుకు విరాళాలు ఇచ్చి దర్శన టికెట్లు పొందేందుకు యూపీఐ విధానాన్ని కూడా భక్తులకు అందుబాటులోకి తేవాలని ఈవో దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్‌గా సుమతి బాధ్యతల స్వీకారం



తిరుపతి రూరల్, జూన్ 21: తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు(ఏడీఆర్)గా డాక్టర్ వి.సుమతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకముందు ఏడీఆర్‌గా ఉన్న సి.రమణ ప్రధానశాస్త్రవేత్తగా బదిలీ అయ్యారు. ఈసందర్భంగా సుమతి మాట్లాడుతూ.. పరిశోధనాస్థానాలు, కేవీకేలు, ఏరువాక కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన నూతన సాంకేతిక పరిజ్ఞానం చేరువయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన ఏడీఆర్‌ని శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

వ్యవసాయ కాలేజీ ఏడీగా రమణ



ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ ఎంవీ రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కళాశాలలో వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగాధిపతి పనిచేసే ఈయన్ను ఏడీగా నియమించారు. రమణను ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

వీనులవిందుగా సంగీత సప్తాహం



తిరుపతి (కల్చరల్), జూన్ 21: స్వాస్ మనోవికాస్ సేవా సంస్థ, టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల ఆధ్వర్యంలో సప్తగిరి సంగీత సప్తాహం కొనసాగుతోంది. శుక్రవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం ఏడు గంటల నుంచి పలువురు గాత్ర విద్వాంసులు నిరంతరంగా అన్నమాచార్యుల సంకీర్తనలు వీనులవిందుగా గానంచేశారు. తిరుపతి ఆకాశవాణి కళాకారిణి ఆర్.తులసిబాయ్ గాత్ర కచేరిలో సప్తాహం నిర్వాహకుడు మురళీకృష్ణ తన తబలా వాద్య విన్యాసంతో సభికులను ఆకట్టుకున్నారు.

తిరుపతి నర్తకికి మలేషియాలో సత్కారం



మలేషియా మంత్రి సరస్వతి నుంచి జ్ఞాపిక అందుకుంటున్న సుమనశ్రీ

తిరుపతి (కల్చరల్), జూన్ 21: తిరుపతికి చెందిన ప్రముఖ నర్తకి, రచయిత్రి డాక్టర్ కోదూరి సుమనశ్రీని మలేషియాలోని ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ వారు సత్కరించారు. వార్షిక భారతీయ కళా ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు ఆదేశంలో జరిగిన ఉత్సవాల్లో సుమనశ్రీ హాజరై.. కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా మలేషియా ప్రభుత్వ సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.సరస్వతి ద్వారా సత్కారం అందుకున్నారు.

ఎస్వీయూ నాన్ టీచింగ్ ఎన్నికల అధికారిగా షఫీ



నియామక పత్రం స్వీకరిస్తున్న షఫీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 21: ఎస్వీయూలో నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికల అధికారిగా షఫీ నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఆమోదం తెలిపారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను అయనకు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీకే సుబ్రహ్మణ్యం, ఎన్.సుబ్రహ్మణ్యం అందజేశారు.

గూడూరు-రేణిగుంట మధ్య
మూడో రైలు మార్గం వేయండి

తిరుపతి(సెంట్రల్), జూన్ 21: గూడూరు-రేణిగుంట రైల్వే జంక్షన్ల మధ్య రోజు రోజుకూ రైళ్ల సంఖ్య పెరుగుతోంది. వస్తు రవాణా చేసే గూడ్స్ రైళ్ల సంఖ్య కూడా పెరిగింది. ఈ రెండు జంక్షన్ల మధ్య పుణ్యక్షేత్రాలతోపాటు పరిశ్రమలు, విద్యాసంస్థలు ఉన్నాయి. అందుకనుగుణంగా రవాణా వసతులు లేవు. పైగా ఈ మార్గంలోనే హౌరా, విశాఖపట్టణం, ఢిల్లీ, అస్సాం, జైపూర్, వారణాసిలతోపాటు పలు ప్రధాన నగరాలకు ప్యాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. అందువల్ల ఈ మార్గంలో మూడో రైలు మార్గం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయినా పట్టించుకునే వారు లేరు. తరచూ రైల్వే అధికారులు వస్తున్నారు.. తమ పర్యటనలు పూర్తి చేసుకుని వెళుతున్నారే కానీ రవాణా వసతుల మెరుగు కోసం దృష్టి పెట్టడం లేదన్న విమర్శలున్నాయి. ఇకనైనా ఈ మూడో రైలు మార్గం ఆవశ్యకతను గుర్తించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్టౌనుంచి మంటలు అంటుకుని వివాహిత మృతి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 21: స్టౌనుంచి మంటలు అంటుకుని ఓ వివాహిత మృతి చెందింది. ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అరక్కోణంకు చెందిన ప్రవీణకు తిరుపతిలో ఉంటున్న లోకేష్‌బాబుతో 23ఏళ్ల కిందట వివాహమైంది. వీరు పోస్టల్ కాలనీలో కాపురముంటున్నారు. ప్రవీణ శుక్రవారం మధ్యాహ్నం వంట చేయడానికి స్టౌ వెలిగించగా, ప్రమాదవశాత్తూ మంటలుచీరకు అంటుకోవడంతో శరీరం పూర్తిగా కాలిపోయింది. భర్త, కుమారుడు, చుట్టుపక్కల వారు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికితరలించారు.అక్కడచికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

సీతమ్మ భూములకు రక్షణ కల్పించాలి

తిరుపతి(వైద్యం), జూన్ 21 : ఎంఆర్‌పల్లెలోని సీతమ్మ భూములకు రక్షణ కల్పించాలని సీనియర్ జర్నలిస్టు మిట్టా లోకేష్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పంగులూరు సీతమ్మ పేరుపై కొత్తవీధిలో ఉన్న ఒక ఇంటిని, 43 ఎకరాల భూమిని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానానికి అప్పగించారని చెప్పారు. కాలక్రమేణా వైశ్య పెద్దలు కొందరు ఆ భూములను ఆక్రమించుకోవడం దౌర్భాగ్యమన్నారు. ఆలయ అధ్యక్ష స్థాయిలో ఉన్న కొందరు వ్యక్తులు ఈ భూములకు సంబంధించి రూ. కోట్లను వసూలు చేశారని ఆరోపించారు. ఇప్పటికే ఈ భూములను ఆక్రమించి.. రిజిస్ట్రేషన్లు కూడా చేసుకుంటున్నారని తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డీటీఆర్‌లు విఫలమైతే మరమ్మతులు చేయండి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 21: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విద్యుత్ నియంత్రిక(డీటీఆర్)లు విఫలమైతే వెంటనే మరమ్మతులు చేయాలని ఎస్ఈ సురేంద్ర నాయుడు ఆదేశించారు. శుక్రవారం సర్కిల్ పరిధిలోని ఎనిమిది డివిజన్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వినియోగదారుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని చెప్పారు. బకాయిలు వంద శాతం వసూలు చేయాలన్నారు. కొత్త సర్వీసులను త్వరగా మంజూరు చేయాలని చెప్పారు. టెక్నికల్ ఈఈ శ్రీనివాసులు ఈఈలు, డీఈఈలు, ఏఈలు, ఏఏవోలు పాల్గొన్నారు.

నేడు 'ఆఖరి స్నేహితుడు' పుస్తకావిష్కరణ

తిరుపతి (కల్చరల్), జూన్ 21: ప్రముఖ కథా రచయిత తిరువాయిపాటి రాజగోపాల్ రచించిన ఆఖరి స్నేహితుడు పుస్తకావిష్కరణ శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆఫీసర్స్ క్లబ్‌లో జరగనుంది. తిరుపతి జిల్లా రచయితల సంఘం నిర్వహించే ఈ సభలో ఆచార్య పి.దేవసేన నాయుడు, ఆచార్య ఎ.గురుమూర్తి, ఆచార్య మధురాంతకం నరేంద్ర, ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు, డాక్టర్ సాకం నాగరాజు, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, రచయిత తదితరులు పాల్గొంటారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీ

తిరుపతి(విద్య), జూన్ 21: సంజయ్‌గాంధీ కాలనీ నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. తిరుపతి అర్బన్ మండల విద్యాశాఖాధికారి కె.బాలాజి, హెచ్ఎం ధనుంజయనాయుడు, టీచర్లు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్ వద్దు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 21: జంక్‌ఫుడ్‌ను దూరంగా ఉంచాలని ఉంచి, ఆరోగ్యకరమైన చిరుధాన్యాలతో తయారైన ఆహార పదార్థాలను తీసుకోవాలని టాటా ట్రస్ట్ హేమంత్ అన్నారు. శుక్రవా రం సంజయ్ గాంధీ కాలనీలోని రాస్ క్లస్టర్ కార్యాలయంలో ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహించారు. పొదుపు సంఘాల మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. రామాంజనేయులు, జయమ్మ, సీతామహాలక్ష్మి, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగుల కోసం పోటీ

- నాయకుల చుట్టూ అధికారుల ప్రదక్షిణ
- కోరుకున్న చోట ఆరాటం
- గత టీడీపీ ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారుల యత్నం

తడ, జూన్ 21: ఎన్నికలు అయిపోయాయి... ప్రజల్లో హడావుడి పక్కకెళ్లింది. ఇప్పుడు అధికారుల హడావుడి మొదలైంది. రోజూ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎందుకంటరా... ప్రభుత్వం మారిందిగా... తాము కోరుకున్న చోట పోస్టింగ్‌ల కోసం. అందులోనూ గతంలో అవినీతి ఆరోపణలతో దూరమైన ఉద్యోగానికి మళ్లీ అదేస్థానంలో కొందరు అవినీతి అధికారులు పోస్టింగ్‌ల కోసం పోటీ పడుతుండటం విశేషం. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం మండల స్థాయి అధికారులందరినీ బదిలీ చేసింది. పక్కజిల్లాల అధికారులు కొలువుదీరి ఎన్నికల రంగాన్ని సమర్థవంతంగా నడిపించారు. ఇప్పుడు ఎన్నికలు అయిపోయి ప్రభుత్వం మారిపోయింది. దీంతో ఉద్యోగులు అలెర్ట్ అయ్యారు. వారికి తాము కోరుకున్నచోట పోస్టింగ్ కోసం ఆరాటపడుతున్నారు. నిన్నటి వరకు గుర్తుకురాని నాయకుల ఇళ్లను నేడు వెతుక్కొని వెళ్లి మరీ తమకు అనుకూలమైన చోట పోస్టింగ్ ఇప్పించాలంటూ అభ్యర్థిస్తున్నారు. అందుకు తాము అనుకూలంగా వ్యవహరిస్తామంటూ వెల్లడిస్తున్నారు. ఫలనా అధికారికి ఫలనా నాయకుడు హామీ ఇచ్చాడుకదా... బహుశా ఆయనకే అక్కడ పోస్టింగ్ వచ్చేలా ఉందని మాటలు వినబడుతున్నాయి. అయితే కొందరు అధికారుల విషయంలో విస్మయం వ్యక్తమవుతోంది. గతంలో అవినీతి ఆరోపణలే దీనికి కారణం. వారు మళ్లీ ఇక్కడ అధికారిగా వస్తే అవినీతికి అంతు ఉండదని మాట్లాడుకోవడం కన్పిస్తోంది. ఈ మాటలు ముఖ్యంగా పోలీసు శాఖపైనే ఎక్కువగా సాగుతున్నాయి. ముఖ్యంగా 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పనిచేసిన ఒకరిద్దరు అధికారులపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణాలో సదరు అధికారుల ప్రత్యక్ష సహకారం ఉండటమే కారణం. దీంతో అప్పట్లో సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో 2016లో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లా పోలీస్ బాసుగా పీహెచ్‌డీ రామకృష్ణను నియమించి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించినవెంటనే సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలోని అవినీతిపై విచారణ జరిపించారు. అధికారుల ప్రత్యక్షపాత్రపై నిర్ధారణకు వచ్చి వారిపై చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి లూప్‌లైన్‌లో ఉన్న సదరు అధికారులు టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో మళ్లీ నాయకుల ముందు ప్రత్యక్షమైపోయారు. తమకు జాతీయ రహదారుల వెంబడి ఉండే పోలీస్ స్టేషన్లలో పోస్టింగ్ ఇప్పించాలంటూ వేడుకుంటున్నారు. వీరికి గత టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలలో చక్రం తిప్పిన కొందరు స్మగ్లర్లు తోడై వారికి పోస్టింగ్ ఇప్పించేందుకు తమ వంతుసాయం చేస్తున్నట్లు గుసగుసలు ఉన్నాయి. అయితే 2016లో ఈ అధికారులు పాల్పడ్డ అవినీతిని ప్రస్తుత నాయకులు గుర్తు లేదేమో కానీ ప్రజలు మరచిపోలేదు. దాంతో ఈ అధి కారులు ఈ ప్రాంతంలో పోస్టింగ్ వస్తే అవినీతికి ద్వారాలు తెరచినట్లేనని మాట్లాడుకుంటున్నారు. ఏదీ ఏమైనా ప్రభుత్వం మారడంతో అధికారుల పోస్టింగ్‌లో పోటీ తీవ్రంగా నెలకొని ఉంది. అవినీతి అధికారులను దూరంగా ఉంచితే మంచిదంటూ జనం మాట్లాడుకుంటున్నారు.

పరిహారం అందించి న్యాయం చేయండి


నిరసనలో ఉడతావారిపార్లపల్లి రైతులు

చిల్లకూరు, జూన్ 21: సాగరమాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు పరిహారం అందించా లని మండలం లోని ఉడతా వారిపార్లపల్లికి చెందిన రైతులు శుక్ర వారం వారి భూముల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 60 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న తమ భూములకు ఏలాంటి పరిహారం ఇవ్వకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు సుమారు 18 ఎకరాల భూమి చెరువు పోరంబోకు కింద ఉందని, పట్టాలున్నా చెల్లవని పరిహారం ఇవ్వకుండా తమను మోసం చేశాన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించిన తమకు పరిహారం కానీ, పొలం కానీ ఇవ్వాలని కోరారు.

నీట్‌ను రద్దు చేయాలి


కాంగ్రెస్ నాయకుల నిరసన

గూడూరు అర్బన్, జూన్ 21: ఇటీవల జరిగిన నీట్‌లో పలు అవకతవకలు వెలుగు చూశాయని దాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. శుక్ర వారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీట్ అవకతవకలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటి వరకు ఈ విషయమై బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ ధర్నాలో వేమయ్య, చంద్రశేఖర్, సుబ్బరామరాజు, శ్రీనివాసాచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న జడ్జి షమ్మీపర్వీన్‌సుల్తానాబేగం

గూడూరు అర్బన్, జూన్ 21: స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న జాతీ య లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకో వాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానాబేగం అన్నారు. శుక్ర వారం కోర్టు ఆవరణలో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులను కక్షిదారులు లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. దీంతో సమయం, నగదు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సులోచనా రాణి, లోకనాథం, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ పాపారావు, పార్వతయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో సెక్రటరీ జనరల్‌గా చిరంజీవి



గూడూరు అర్బన్, జూన్ 21: విజయవాడలోని ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఫ్యాప్టో సెక్రటరీ జనరల్‌గా గూడూరుకు చెందిన ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. దీంతో డివిజన్ ఏపీటీఎఫ్ నాయకుడు శివరామిరెడ్డి, రమణయ్య, బాబు, శివ, జైపాల్, భాస్కర్‌రెడ్డి, మురళీమోహన్ హర్షం వ్యక్తం చేశారు.

వేలం వాయిదా

కోట, జూన్ 21 : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఈ నెల 22వ తేదీ జరగాల్సిన చెట్ల వేలం వాయిదా వేసినట్లు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల వేలంను జూలై 6వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. అదే రోజు ఉదయం 10.30గంటలకు కోర్టు ప్రాంగణంలో వేలం నిర్వహిస్తారని జడ్జి తెలిపారు.

ఏపీ హంస కార్యవర్గం

నాయుడుపేట/కోట, జూన్ 21: నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్స్ అసోసియేషన్ నాయుడుపేట తాలూకా కమిటీని ఎన్నుకున్నారు. నాయుడుపేట తాలూకా అధ్యక్షుడిగా కె.వెంకటగోపాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ కృష్ణవేణి, సెక్రటరీగా ఆకుల సుభాషిణి, కోశాధికారిగా బల్లి ప్రభాకర్, మహిళా విభాగ కార్యదర్శిగా సంపూర్ణమ్మ తదితరులను ఎన్నుకున్నారు. కోట పట్టణంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఏపీ హంస ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. వాకాడు తాలూకా అధ్యక్షుడిగా కె.నాగయ్య, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా రవి, కార్యదర్శిగా పి. లక్ష్మీపతి, కోశాధికారిగా విజయభారతి తదితరులు ఎన్నికయ్యారు.

శ్రేష్టలో మండల విద్యార్థిని ప్రతిభ


నేత్విక

పెళ్లకూరు, జూన్ 21: స్కీమ్ ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హై స్కూల్ (శ్రేష్ట) ప్రవేశ పరీక్షా ఫలితాల్లో మండలంలోని తాళ్వాయిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వి.నేత్విక జాతీయ స్థాయిలో 351వ ర్యాంకు సాధించింది. దీంతో ఇంటర్ మీడియట్ వరకు నాలుగేళ్ల పాటు ఇంటర్నేషనల్ స్కూల్లో ఉచితంగా విద్యను అభ్యసించేందుకు అర్హత పొందింది.

మట్టి నమూనాల సేకరణ


మట్టి నమూనాల సేకరనలో అధికారులు

సూళ్లూరుపేట, జూన్ 21: మండల పరిధిలోని కోటపోలూరులో శుక్రవారం వ్యవసాయాధికారులు రైతుల సాగు చేసే భూ ముల్లో మట్టి నమూనాలను సేకరించారు. వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనిత ఆధ్వర్యంలో రైతులకు పలు సూచనలు చేశారు. మెలకవలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్ర మంలో ఏవో కవిత, గ్రామ సహాకులు హిమబిందు, చిరంజీవి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గరుడ సేవ



గూడూరు అర్బన్, జూన్ 21: స్థానిక రాజా వీధిలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని మోహినీ అలంకారంలో పల్లకిపై అధిష్ఠింపజేసి ఊరేగించారు. రాత్రికి స్వామివారిని ప్రత్యేకంగా అలంక రించి అయనకు ఇష్టమైన గరుడవాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గూడూరు అర్బన్, జూన్ 21: స్థానిక తాళమ్మగుడి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి శుక్రవారం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘ టనా స్థలానికి చేరుకున్న పోలీ సులు మృతదేహాన్ని పరిశీలిం చారు. 55ఏళ్ల వయస్సు ఉండవ చ్చని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ చెప్పారు.

ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం... టీడీపీ నాయకుల సంబరం


గూడూరు, బాలాయపల్లి, డక్కిలిలో టీడీపీ నాయకుల సంబరాలు

గూడూరు, జూన్ 21: పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద టీడీపీ మాజీ కౌన్సిలర్ వి.శివకుమార్ ఆధ్వర్యంలో భారీ స్ర్కీన్‌ను ఏర్పాటు చేసి పాశిం సునీల్‌కుమార్ ప్రమాణస్వీకారం చేస్తుండగా వీక్షిస్తూ, బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. పి.శ్రీనివాసులు, బి.చెంచురామయ్య, వి.హరి, జి.లీలావతి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చెన్నూరులో మట్టం శ్రావణి ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

డక్కిలి: కురుగొండ్ల ప్రమాణ స్వీకారం సందర్భంగా డక్కిలిలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ.రామచంద్రయ్య నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. డి.చంద్రారెడ్డి, డి.పెంచలరెడ్డి, వి.నాగభూణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు పులికొల్లు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, తిరుపతి పార్లమెంటు పార్టీ వాణిజ్య విభాగ అధ్యక్షుడు పి. విశ్వనాథనాయుడు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బాలాయపల్లి: స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రాయి సత్యంనాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, కె.రామచంద్రనాయుడు, టి.ప్రసాద్ నాయుడు, దాసరి కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


వెంకటగిరి టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు

పెళ్లకూరు: ఎమ్మెల్యే విజయశ్రీ ప్రమాణస్వీకారం సందర్భంగా పెళ్లకూరు మండలం నుంచి అమరావతికి తరలి వెళ్లిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వి.శేఖర్ నాయుడు, డి.ప్రసాద్‌నాయుడు, హరినాయుడు, ఎస్.ప్రసాద్‌నాయుడు, సిద్దులయ్యనాయుడు, యుగంధర్, నరేంద్రయాదవ్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేగా కురుగొండ్ల ప్రమాణ స్వీకారం


ప్రొటెం స్పీకర్ బుచ్చయ్యతో కురుగొండ్ల

వెంకటగిరి, జూన్ 21 : తమ అభిమాన నాయకుడు కురుగొండ్ల రామకృష్ణ మూడోసారి ఎమ్మెల్యేగా శుక్రవారం అమరావతిలోని అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు టీవీల ద్వారా వీక్షించారు. రామకృష్ణ ప్రమాణ స్వీకారం అనంతరం స్పీకర్‌కి పాదాభివందనం చేశారు.

విజయశ్రీ ప్రమాణస్వీకారం


ప్రొటెం స్పీకర్ బుచ్చయ్యతో విజయశ్రీ

తడ, జూన్ 21: సూళ్లూరు పేట శాసనసభ్యురాలిగా డాక్టర్ నెలవల విజయశ్రీ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలోని శాసన సభ లో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సమక్షంలో విజయశ్రీ ప్రమాణం చేశా రు. సార్వత్రిక ఎన్నికల్లో సూ ళ్లూరుపేట ఎమ్మెల్యేగా గెలు పొందిన ఆమె తొలి మహిళా ఎమ్మెల్యే కావడం విశేషం. ప్రమాణస్వీకారం అనంతరం ప్రొటెం స్పీకర్ వద్దకు వెళ్లి అభివాదం చేసి అక్కడ నుంచి ఆమె నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి లోకేశ్‌కు నమస్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. నెలవల విజయశ్రీ ప్రమాణస్వీకారం సందర్భంగా నియోజకవర్గం నుంచి నాయకులు పెద్ద ఎత్తున అమరావతికి తరలివెళ్లారు. అక్కడ ఎమ్మెల్యే విజయశ్రీని అభినందనలతో ముంచెత్తారు. ఎమ్మెల్యేను కలుసుకున్నవారిలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, నాయకులు బి.ఫణి, శ్రీధర్, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, విజయకుమార్‌నాయుడు, నాగేంద్రరెడ్డి, ఆకుతోట రమేష్, చైతన్య కృష్ణారెడ్డి, లోకేష్, రఫీ, సుదర్శన్, ఏకాంబరం, జయపాల్ తదితరులు ఉన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి



గూడూరు, జూన్ 21: గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరుజిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు అభివాదం చేశారు.

సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన గణపర్తి



చిట్టమూరు, జూన్ 21: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును చిట్టమూరు టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలసి శుభా కాంక్షలు తెలియజేశారు. అమరావతిలో ఆయనను కలసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈయనతో పాటు మండల టీడీపీ నాయకులు మారంరెడ్డి జనార్దన్‌రెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, కస్తూరయ్య ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవాలు



దొరవారిసత్రం, జూన్ 21: మండలంలోని బుదూరులో రుక్మిణి సమేత పాండురంగ స్వామి ఉత్సవాల్లో భాగంగా భక్తులు అగ్నికుండ ప్రవేశం చేశారు. నెల రోజుల పాటు ఆ గ్రామంలో 70 మంది భక్తులు పాండురంగ స్వామి భజన చేస్తూ శుక్రవారం స్వామి ఉత్సవాల్లో అగ్ని తొక్కారు.

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లిలో పాండురంగస్వామి ఆలయ అగ్ని గుండ మహోత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. శుక్రవారం సాయంకాలం భక్తులు కంకణాలు ధరించి గోవింద నామస్మరణలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.శేఖర్‌రెడ్డి, శ్రీదేవి, బియ్యపు గోవిందురెడ్డి, రమేష్‌రెడ్డి, తిరుపాలు తదితరులు ఉన్నారు.

హుస్సేనమ్మ దర్గాలో భక్తుల సందడి

దొరవారిసత్రం, జూన్ 21 : దొరవారిసత్రం మండలం నెలబల్లిలోని హుస్సేనమ్మ దర్గాలో శుక్రవారం రాత్రి భక్తుల సందడి కన్పించింది. దర్గా ఉత్సవాల్లో రెండవ రోజు శుక్రవారం తెల్లవారు జామున గంధం ఊరేగింపు నెలబల్లిలో జరిగింది. ఊరేగింపు అనంతరం గంధాన్ని భక్తులకు పంచి పెట్టారు. రాత్రి పరిసర ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసి దర్గాలో హుస్సేనమ్మకు పూజలు చేశారు. స్థానిక కళాకారులచే పాటకచ్చేరి కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ తిరుమలరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

చిల్లకూరు, జూన్ 21: మండలంలోని తిమ్మనగారిపాళెంలో విద్యుతాఘాతంతో తొమ్మిది గేదెలు మృతిచెందాయి. బాధితుల కథనం మేరకు.... గ్రామానికి సమీపంలోని చెరువులో 11కేవీ విద్యుత్ తీగ తెగిపడి ఉండడంతో మేతకు వెళ్లి వస్తున్న గేదెలకు తగిలి మృతిచెందాయి. గ్రామానికి చెందిన యానాదిరెడ్డి చెందిన 3 గేదెలు, శ్రీనివాసులురెడ్డికి చెందిన 3, సుమన్‌కు చెందిన 2, జనార్దన రెడ్డికి చెందిన గేదె మృతిచెందాయి. దీంతో బాధితులు పోలీసులు ఫిర్యాదు చేశారు.

కోటలో టీడీపీ నేతల సంబరాలు


క్రాస్‌రోడ్డులో సుష్మారెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు - బజారు సెంటర్‌లో టీడీపీ నాయకుల సంబరాలు

కోట, జూన్ 21: కోట పట్టణం, కోట క్రాస్‌రోడ్డులో శుక్రవారం టీడీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన పాశిం సునీల్‌కుమార్‌కు మద్దతుగా కోట గోపాల్‌రెడ్డి విగ్రహం నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమరెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా క్రాస్‌రోడ్డులో తెలుగుమహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు జి.సుష్మారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పాశిం సునీల్‌కుమార్ నాయకత్వంలో మరింత అభివృద్ధి జరగాలని నినాదాలు చేశారు. మర్రి అనిల్, నరేంద్రరెడ్డి, పోలయ్య, రాధాక్రిష్ణారెడ్డి, మస్తాన్‌బాషా, సురేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గూడలిలో వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో, చెందోడులో పార్టీ జిల్లా కార్యదర్శి వాకా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి.

యోగాతో ఒత్తిడి దూరం


షార్‌లో యోగాసనాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు

సూళ్లూరుపేట, జూన్ 21: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మైదానంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగాసానాలు వేశారు.

గూడూరు: ఒత్తిడిని అధిగమించేందుకు యోగా దోహదపడుతుందని బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర బీజేపీ సహ ఇన్‌చార్జి సునీల్ దియోధర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో హాలండ్‌కు చెందిన మహర్షి వేదిక్ యూనివర్సిటీ, ఆదిశంకర విద్యాసంస్థల ఆధ్వర్యంలో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యోగా ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చేలా ప్రధాని నరేంద్రమోదీ కృషి చేశారన్నారు. యోగాతో ఏకాగ్రతను పెంచుకుని చదువులో లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ మోహన్, శేఖర్‌రెడ్డి, రామయ్య, యోగా గురువు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో, ప్రగతి సేవాసంస్థల ఆధ్వర్యంలో, నారాయణ జూనియర్ కళాశాలలో దినోత్సవాన్ని నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పీఈటీ మహేష్, ఉపాధ్యాయుడు సుంకర రవి అన్నారు. శుక్రవారం పలు పాఠశాలల్లో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఆసనాలు వేయించారు.

బాలాయపల్లి: పంచాయతీలోని చుట్టి గ్రామంలో జరుగుతున్న అమృత సరోవర్ పనుల వద్ద ఉపాధి కూలీలు యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు వేశారు.ఈ కార్యక్రమంలో ఏపీవో మృత్యుంజయరావు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఎంఈవో మునిరత్నం ఆధ్వర్యంలో జరిగింది. యోగా మాస్టర్లు పద్మనాభం, సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి హెచ్ఎం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను ఎన్‌సీసీ కేడెట్లు యోగా క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

చిల్లకూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ మీరాసాహెబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు యోగాసనాలు వేశారు.


చుట్టి గ్రామంలో ఉపాధి కూలీల యోగా , ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో , గూడూరులో యోగాసనాల్లో విద్యార్థులు

వెంకటగిరిలో విస్తరణకు నోచుకోని రహదారులు


పోలేరమ్మ ఆర్చి వద్ద ట్రాఫిక్ జామ్

వెంకటగిరి టౌన్, జూన్ 21: అడుగు వేస్తే ట్రాఫిక్ జాం... అడుగు తీసినా ట్రాఫిక్ జాం... వాహనం ఎదురొస్తే ట్రాఫిక్ జాం... పక్కకు వెళ్లినా ట్రాఫిక్ జామ్మం... ఇది వెంకటగిరి పట్టణంలో ప్రస్తుత పరిస్థితి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరణకు నోచుకోని రహదారులతో వెంకటగిరి పట్టణవాసులు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు. వెంకటగిరికి మున్సిపాలిటీ హోదా వచ్చి 17 సంవత్సరాలవుతోంది. సుమారు 65వేల జనాభా పైచిలుకు ఉన్న మున్సిపాలిటీ. ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చిపోయే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ఇక్కడి నుంచి తిరుపతికి రాకపోకలు సాగుతుంటాయి. వెంకటగిరికి సమీపంలోని మేనకూరు సెజ్, వాంపల్లి వద్ద పలు కంపెనీలు, చింతలపాళెం పరిశ్రమలు రావడంతో అక్కడ పనిచేసుకుని వెంకటగిరి వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. కంపెనీల్లో పని చేస్తున్న కార్మికుల కోసం పరిశ్రమలు బస్సులు ఏర్పాటు చేయడంతో వెంకటగిరి రూపురేఖలు మారుతున్నాయి. బయట నుంచి వచ్చే బస్సులు, లారీలు గంటల తరబడి రోడ్డుపై నిలపడంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతుంది.

ట్రాఫిక్ సమస్యలకు ఇవే ప్రధానం...

పట్టణంలోని ప్రధాన వీధులు రాజావీధి, తూర్పువీధి, కాశీపేట సెంటర్, త్రిభువని, క్రాస్ రోడ్డు, పాలకేంద్రం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా రద్దీగా ఉంటుంది. చిరు వ్యాపారులు సహా వాహనదారులు ఎక్కడ బడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ జాం అవుతోంది. రాజా వీధి, తూర్పు వీధి, దక్షిణపు వీధి, ఉత్తరపు వీధుల్లో వాహనాలు వన్‌వే నియంత్రణ చేస్తే కొంత వరకు తగ్గించవచ్చు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

శ్రీసిటీని సందర్శించిన ఎస్పీ



ఎస్పీకి శ్రీసిటీ గురించి వివరిస్తున్న ఎండీ

శ్రీసిటీ, జూన్ 21: జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. మొదటి సారి శ్రీసిటీకి విచ్చేసిన ఆయనకు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలు, ఇక్కడ అనుసరిస్తున్న భద్రతా విధానాలను వివరించారు. శ్రీసిటీ రాష్ట్ర సరిహద్దులో ఉన్నందువల్ల డ్రగ్స్ రవాణా, అక్రమ మద్యం తరలింపు, స్మగ్లింగ్ వంటి సంఘ వ్యతిరేక కార్యాకలాపాలకు ఆస్కారం ఉందంటూ సన్నారెడ్డి ఎస్పీకి వివరించారు. ముఖ్యంగా మహిళ ఉద్యోగులు, విద్యార్థులు, విదేశీ ప్రతినిధులు అధిక సంఖ్యలో ఉన్న శ్రీసిటీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ శ్రీసిటీ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, శాంతి భద్రతలపై సమీక్షించారు. కార్యక్రమంలో శ్రీసిటీ డీఎస్పీ వైడేశ్వరరావు, సీఐ భాస్కర్, ఎస్ఐ శ్రీకాంత్, సెక్యూరిటీ విభాగం జీఎం రమేష్ తదితరులు ఎస్పీ పర్యటనలో పాల్గొన్నారు.

పోలీసుల ఆత్మీయ సమావేశం

శ్రీకాళహస్తి, జూన్ 21: ఎన్నికల విధులు విజయవంతం కావడంపై శ్రీకాళహస్తి, రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో ఆత్మీయ సమావేశం జరిగింది. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన ఈ సమావేశానికి తిరుపతి శాంతి భద్రతల విభాగం ఏఎస్పీ కులశేఖర్ ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ప్రారంభమైనప్పటి నుంచి కౌంటింగ్ తరువాత కోడ్ ముగిసే వరకు పోలీసుశాఖ సిబ్బంది నిరంతరం శ్రమించారని కొనియాడారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. అనంతరం ఎస్పీ పోలీసు సిబ్బందికి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఉమామహేశ్వర రెడ్డి, భవ్యకిషోర్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన సీఐఐ బృందం



హావెల్స్ పరిశ్రమలో సీఐఐ బృందం

శ్రీసిటీ, జూన్ 21: భారత పరిశ్రమల సమాఖ్య విజయవాడ జోన్‌కు చెందిన 16మంది బృందం(సీఐఐ) శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్ వారికి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలోని పరిశ్రమలు అమలు చేసే ఉత్తమ పద్ధతులను, సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోవడం, వాటిపై అధ్యయనం చేయం ప్రధాన లక్ష్యంగా సీఐఐ బృందం సభ్యుల పర్యటన సాగింది. పర్యటనలో భాగంగా హావెల్స్, ఆల్స్టమ్, ఐకే అల్యూమినియం, డానిలీ పరిశ్రమలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చర్చా కార్యక్రమాల్లో బృందం సభ్యులు పాల్గొని సాంకేతిక నైపుణ్యాలను, తయారీ విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ బృందానికి విజయవాడ జోన్ ఛైర్మన్ డీవీ రవీంద్రనాథ్, వైస్ ఛైర్మన్ వీ.నాగలక్ష్మి నాయకత్వం వహించారు.

ఐఐటీలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు, జూన్ 21: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయాన్ని ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ తొలి విడతగా కేంద్రీయ విద్యాలయంలో గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5 వరకు తరగతులు ప్రారంభించామని చెప్పారు. ప్రతి సెక్షన్‌లో 32మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఐఐటీ రిజిస్ట్రార్ సుమిత్ బిస్వాస్, ఐసర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కనగ శేఖరన్, డిప్యూటీ ప్రొఫెసర్, కేంద్రీయ విద్యాలయం లైజన్ ఆఫీసర్ చమన్ మెహతా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పిచ్చాటూరు, జూన్ 21: పిచ్చాటూరు సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రవి తెలిపారు. ప్రజలు విద్యుత్ అంతరాయాన్ని గుర్తించి సహకరించగలరని ఆయన కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం





శ్రీకాళహస్తిలో యోగా సాధన చేస్తున్న కోలా ఆనంద్ తదితరులు - వరదయ్యపాళెం జూనియర్ కళాశాలలో విద్యార్థులు

శ్రీకాళహస్తి, జూన్ 21: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. శుకబ్రహ్మాశ్రమంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామిని సన్మానించారు. కార్యక్రమంలో మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, సుకుమార్, అమర్‌నాథ్, కొండేటి గోపాల్, వాసుయాదవ్, భరత్‌కుమార్ నాయుడు, హరీష్‌రెడ్డి, డిల్లీకుమార్, ప్రసాద్, ప్రతాప్, హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇక పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు యోగాసనాలు వేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన శివసాయి యోగా సెంటర్ నిర్వాహకురాలు సుజాత యోగా విశిష్టను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, యోగా గురువు భాస్కర్, అధ్యాపకులు సత్యనారాయణరెడ్డి, నరసింహవర్మ, బాపనయ్య తదితరులు పాల్గొన్నారు. ఇక బాబు అగ్రహారంలోని పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పార్వతి, యోగానంద, అజారుద్దీన్, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అశోక్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు

శ్రీసిటీ: శ్రీసిటీ జనరల్ మేనేజర్ సన్యాసిరావు ఆధ్వర్యంలో స్థానిక విజిటర్స్ సెంటర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా గురువు, ఏపీ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.కోదడం ముఖ్య అతిథిగా విచ్చేసి సూర్య నమస్కారాలు, వివిధ శ్వాస వ్యాయామాల పట్ల శిక్షణ ఇవ్వడంతో పాటు, యోగా వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు. శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులు, సెజ్ కార్యాలయ సిబ్బంది, పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● స్థానిక ఎంజేపీబీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రవి, బీజేపీ నాయకుడు మోహన్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వరదయ్యపాళెం: స్థానిక జూనియర్ కళాశాలలో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒన్‌నెస్ యోగా సాధన చేశారు. తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు చంద్రప్ప, లక్ష్మీ దాసాజీ, బీజేపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, దిలీప్‌రాయల్, మోహన్‌నాయుడు, రమణయ్య పాల్గొన్నారు. అదే విధంగా సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ లక్ష్మీపురం సమీపంలోని కేబీజీ ప్యాలెస్‌లో యోగా దినోత్సవం జరిగింది. బీజేపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, కేబీ గురుదేవ్, భాస్కర్‌రెడ్డి, మునిప్రతాప్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే అభయ ఫౌండేషన్ స్థాపకుడు బాలచంద్ర ఆధ్వర్యంలో వరదయ్యపాళెం పాఠశాలలో యోగా దినోత్సవం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు రమణయ్య పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రూపేష్ కుమార్ విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ అమరేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సమీర్, అధ్యాపకులు రాఘవరెడ్డి, ఉమ, వెంకట సురేష్, జలగం రామాంజులు, శ్రీమన్నారాయణ, శంకరప్ప, వెంకట సుబ్బమ్మ, సువర్ణ, నారాయణరెడ్డి, వైపీ రాధ, సాయితేజ పాల్గొన్నారు.

కేవీబీపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని బీజేపీ నాయకుడు మునిశేఖర్ చెప్పారు. శుక్రవారం కేవీబీపురం ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. బీజేపీ ఆర్గనైజర్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, ధ్యాన జగత్ సౌజన్యంతో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. పుత్తూరు డివిజన్ విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రాజు, పిచ్చాటూరు ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్ రాజు, డాక్టర్ ధనంజయలు, ప్రధానోపాధ్యాయుడు గిరిప్రకాష్, పీడీ అమ్ములు, ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి పాల్గొన్నారు.

నారాయణవనం: సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఛైర్మన్ అశోకరాజు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సిబ్బంది క్రాంతి, అమృత్, శేయా, మీనాక్షి విద్యార్థులకు యోగ తరగతులను నిర్వహించారు. విద్యార్థులతో యోగా చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసాద్, సురేష్, ప్రిన్సిపాల్స్ జనార్దన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో బాలికకు అస్వస్థత

శ్రీకాళహస్తి, జూన్ 21: పాముకాటుతో జబీనా(11) అనే బాలిక అస్వస్థతకు గురైంది. శ్రీకాళహస్తి పట్టణం ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన జబీనా ఇంటి వద్ద ఆడుకుంటుండగా పాము కాటేసింది. బాలిక గట్టిగా కేకలు వేయడంతో కుటుంబసభ్యులు గుర్తించి శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.



శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి శుక్రవారం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు ఆశీస్సులు అందుకుంటున్న సుధీర్‌రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కరించండి

కేవీబీపురం, జూన్ 21: మండలంలోని కర్లపూడి గిరిజనకాలనీవాసులు గత రెండు నెలలుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఉన్న బోరు మరమ్మతులకు గురవడం, పైపులైను దెబ్బతినడంతో సమస్య ఏర్పడిందని, అధికారులకు, నాయకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలోమీటరు దూరంలోని వ్యవసాయం బోర్ల వద్ద నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు తాగునీరు అందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మొక్కు తీర్చుకునేందుకు పాదయాత్ర

శ్రీకాళహస్తి, జూన్ 21: శ్రీకాళహస్తి మండలం అక్కుర్తికి చెందిన పలువురు ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి గెలవాలని కాణిపాక వినాయక స్వామికి మొక్కుకున్నారు. శుక్రవారం మొక్కు తీర్చుకునేందుకు పాదయాత్రగా కాణిపాకం బయలుదేరారు. కార్యక్రమంలో తిరుపాల్, గంగయ్య, ఈశ్వర్, మధు, నాగరాజు, గోవర్ధన్, గంగయ్యస్వామి, ప్రేమ్‌చంద్ తదితరులున్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ

శ్రీకాళహస్తి, జూన్ 21: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్‌సేవ నేత్రపర్వంగా సాగింది. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉత్సవమూర్తులకు అభిషేక పూజలు చేశారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేసి ఊంజల్‌సేవ నిర్వహించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి, జూన్ 21: రామసేతు వంతెనపై నుంచి స్వర్ణముఖి నదిలోకి దూకి ఓ యువతి(22) ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. పెళ్లకూరు మండలం పుల్లూరుకు చెందిన ఓ యువకుడు కాకినాడ ప్రాంతంలో ప్రైవేటు ఉద్యోగం చేసేవాడు. మూడేళ్ల క్రితం కాకినాడకు చెందిన యువతితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఏడాదిన్నర క్రితం ఇద్దరూ వివాహం చేసుకున్నారు. ఆ తరువాత యువకుడు స్వగ్రామానికి వచ్చి ఇక్కడే ప్రైవేటు పనులు చేస్తూ జీవనం కొనసాగించారు. అతని భార్య వరదయ్యపాళెం వద్ద ఉన్న శ్రీసిటీలోని ప్రైవేటు కంపెనీలో చేరింది. అక్కడే విధులు నిర్వహిస్తూ సమీపంలోని హాస్టల్‌లో ఉంటుండేది. ఎంతకాలమైనా భర్త ఇంటికి తీసుకెళ్లకపోవడంతో దంపతుల మధ్య విబేధాలు తలెత్తాయి. శుక్రవారం ఇద్దరూ మాట్లాడుకునేందుకు శ్రీకాళహస్తికి వచ్చారు. ఇక్కడ కూడా వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఇద్దరూ వెళ్లిపోయారు. కాసేపటి తరువాత ఆ యువతి స్వర్ణముఖి నదిపై నుంచి నీటిలో దూకింది. స్థానికులు గమనించి వెంటనే ఆమెను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యువతిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్తను పిలిపించి ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

పుత్తూరు వార్తలు

లక్ష్మీకాసుల హారం ఊరేగింపు



లక్ష్మీకాసుల హారానికి పూజలు

వడమాలపేట, జూన్ 21: అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి జరిగిన గరుడోత్సవానికి తిరుమల నుంచి లక్ష్మీకాసుల హారాన్ని ఊరేగింపుగా అప్పలాయగుంటకు తీసుకువచ్చారు. భక్తులు అడుగడునా శ్రీవారి లక్ష్మీకాసులు హారానికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలతో లక్ష్మీకాసుల హారానికి పూజలు చేసి ప్రత్యేక అలంకార మండపానికి తరలించారు.

గరుడ, పల్లకి వాహనాల వితరణ



పల్లకి, గరుడ వాహనం

వడమాలపేట, జూన్ 21: అప్పలాయ గుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామికి కోడూరుకు చెందిన శివకుమార్‌రాజు రూ.4.25 లక్షల విలువ కలిగిన పల్లకి వాహనాలను బహూకరించారు. అలాగే హైదారాబాద్‌కు చెందిన రవికుమార్ రెడ్డి రూ.90 వేల విలువ కలిగిన గరుడ వాహనాన్ని అందజేశారు.

మోహినీ అలంకారంలో ప్రసన్న వేంకటేశ్వరుడు





పల్లకిలో మోహినీ దేవి అలంకారంలో ప్రసన్న వెంకటేశ్వరుడు - ఉభయ దేవేరులతో స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న పండితులు

వడమాలపేట, జూన్ 21: అప్పలాయగుంటలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మోహినీదేవి అలంకారణంలో భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అలంకారంలో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరుడు ద్విగుణీకృత అలంకార ప్రియుడై కోరిన కోర్కెలు తీర్చే అభయహస్తంతో ప్రసన్న వదనుడైన వైకుంఠనాథుడిని దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు. నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. వాహనసేవ అనంతరం అలసిన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామికి పాలు, పెరుగు, తేనే, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తూ స్నపన తిరుమంజనం గావించారు. సాయంత్రం వెంకటేశ్వరుడిని సుందరంగా అలంకరింపజేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఊంజలసేవ నిర్వహించారు.

కోలాహలంగా గరుడసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి భక్తుల గోవిందనామ స్మరణలతో శ్రీవారి గరుడసేవ కోలాహలంగా నిర్వహించారు. శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడుని వాహనంగా చేసుకుని ప్రసన్న వెంకటేశ్వరుడు పట్టు పీతాంబరాలు, సర్వాలంకరణ భూషితుడై లక్ష్మీ కాసుల హారాన్ని ధరించి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అడుగడుగునా భక్తులు నారీకేలా, కూర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



గరుడ వాహనంలో ప్రసన్న వేంకటేశ్వరుడు

దైనందిన జీవితంలో యోగా భాగం కావాలి



కేకేసీ కళాశాల యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

పుత్తూరు, జూన్ 21: దైనందిన జీవితంలో యోగా భాగం అయితే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని కేకేసీ హోమియోపతి వైద్య కళాశాల ఛైర్మన్ కుప్పయ్యశెట్టి అన్నారు. శుక్రవారం కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా విశిష్టత, ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి యోగా మాస్టర్ కుసుమ ఆసనాలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శరవణన్, వైస్‌ఛైర్మన్ నరసింహారావు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర, జడ్జీలు, న్యాయవాదులు, సిబ్బంది యోగా మాస్టర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. జూనియర్ సివిల్ జడ్జి జానకి, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే హిమజా డిగ్రీ కళాశాల వైస్ ఛైర్మన్ నిషిదరాజు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ సురేంద్ర రాజు, బీజేపీ నాయకులు దామోదర్‌రెడ్డి, శ్రీధర్, శంకర్, మోహనరాజ్, మునస్వామి, గణేష్, మధు, చక్రపాణి, సుబ్రమణ్యం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. పారంపర్య వైద్య మహాసంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యూత్ హాస్టల్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు.



కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న న్యాయవాదులు